వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కొత్తపేటలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు వైష్ణవాలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలునికి ప్రత్యేక అలంకరణ చేశారు.

శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థన మందిరంలో కొలువై ఉన్న శ్రీ కృష్ణభగవానునికి స్వర్ణకిరీట ధారణ నిర్వహించారు. సాయంత్రం సామూహిక భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమాన్ని అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు తదితరులు పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీకృష్ణుని తిరునక్షత్ర మహోత్సవం పేరుతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆగమ పండితులు పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి తిరుమంజనం నిర్వహించారు. దీక్షిత్, ముకుంద తదితరులు పూజలు చేశారు.



వేణుగోపాలస్వామివారిని దర్శించుకుంటున్న వెలంపల్లి శ్రీనివాసరావు

కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో వేంచేసి ఉన్న వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఉభయదేవరులతో కూడిన స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామి వారి నగరోత్సవం నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని కోదండరామాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానునినికి విశేష తిరుమంజనాన్ని నిర్వహించారు. అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు నిర్వహించారు. శేషయ్యవీధిలోని పాండురంగస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఉభయదేవేరులతో కూడిన స్వామి వారికి విశేష అలంకారం నిర్వహించారు. ఆలయ అర్చకులు అద్దేపలి మురళీకృష్ణ నిర్వహించారు. ఇస్లాంపేటలోని గీతామందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను అర్చకస్వామి ఎ.పార్థసారథి నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందేపు మురళీకృష్ణ పర్యవేక్షించారు.

దాండియా నృత్యాలతో సందడి చేసిన విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కూరపాటి హైస్కూల్‌లో శ్రీ కృష్ణుడి జన్మాష్టమి వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య ఆధ్వర్యంలో సందడిగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుడు గోపికలతో పాటు వివిధ రకాల విచిత్ర వేషధారణలో బాలబాలికలు అలరించారు. శ్రీ కృష్ణునిపై భక్తితో, దాండియ, కోలాట నృత్యాలతో డప్పు వాయిద్యాల మధ్య ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణల పోటీలో సుమారు 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రసంసాపత్రాలు అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందించారు.

సంస్కార భారతి ఆధ్వర్యంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంస్కార భారతి విజయవాడ మహానగర్ ఆధ్వర్యాన శనివారం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. చిన్నారులకు శ్రీకృష్ణుడిపై చిత్రలేఖనం పోటీలు, శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలకు శ్రీకృష్ణ పరమాత్మ మూలాధారమని, ఆయన బోధించిన భగవద్గీత భారతీయులందరికి పవిత్ర గ్రంథమని, ఆచరణీయమైనదని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేద హాస్పటల్స్ వైద్యుడు శేషసాయి సంస్కార భారతి సేవలను కొనియాడారు. చింతా వెంకటేశ్వర్లు, బోడి ఆంజనేయరాజు, జొన్నలగడ్డ జగన్మోహనరావు, పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ పాల్గొని ప్రసంగించారు.

భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో..

విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెంటర్ ప్రిన్సిపాల్ జె.సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇస్లాంపేటలోని గీతామందిరంలో శ్రీకృష్ణభగవానునికి విశేష పూజలు



శ్రీకృష్ణ ప్రార్థనామందిరంలో శ్రీకృష్ణభగవానుడు



శేషయ్యవీధిలోని విశేష అలంకారంలో రుక్మాబాయి సమేత పాండురంగడు



దాండియా నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



ఉట్టి కొడుతున్న చిన్నారులు



సంస్కార భారతి నిర్వహించిన పోటీల్లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



ఉట్టి కొడుతున్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు

క్లుప్తంగా

కష్టపడితేనే ఉత్తమ భవిత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కష్టపడి చదివితేనే ఉత్తమ భవితను సొంతం చేసుకుంటారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జోనల్ హెడ్ సీతారామారావు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆంథోని బాలికల పాఠశాల (ఆర్‌సీఎం స్కూల్)లో విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీతారామారావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. పెద్దలు చెప్పే నీతిని, మంచిని పిల్లలందరూ అలవర్చుకొని చదువులో బాగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ సోనీ ప్రశాంత్, విజయవాడ మెయిన్ బ్రాంచి హెడ్ సౌజన్య, కరస్పాండెంట్ మేరీరాణి, ప్రిన్సిపాల్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో రత్నాభరణాల ప్రదర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి మహిళ వేడుక చేసుకునే వేళ మహాత్మగాంధీ రోడ్డులోని మలబార్ షోరూంలో అద్భుత రత్నాభరణాల సేకరణ వ్యాన ప్రదర్శన ప్రారంభమయింది. షోరూంలో శనివారం తమ కస్టమర్లతో ఈ ఆభరణాలను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ అర్జున్ మాట్లాడుతూ ప్రతి మహిళ తన ప్రత్యేకతను చాటుకుంటూ వేడుక చేసుకునే అద్భుతమైన సరికొత్త రత్నాభరణాల సేకరణ వ్యానను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏ రెండు రత్నాలు ఏ ఇద్దరి మహిళలు ఒకేలా ఉండరనే నమ్మకం నుంచి ప్రేరణ పొందిన వ్యాన మహిళల వ్యక్తిత్వం అంతర్గత బలం, స్వీయ వ్యక్తీకరణకు ఒక ప్రశంసగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమర్లు కె.కల్యార్మ, ఎస్‌డీ సన, టి. సునైన, ఎస్ ప్రియ, ఎస్‌కె రాజీ పాల్గొన్నారు.

బుడమేరును ప్రక్షాళన చేయండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం తక్షణమే బుడమేరు ప్రక్షాళన చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ కోరారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విజయవాడ నగర ప్రజలు, బుడమేరు పరివాహ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన గురవుతున్నారన్నారు. శనివారం ఆయన విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం బుడమేరు ప్రక్షాళన చేపడతామని చెప్పిందని, తీరా ఇపుడు బుడమేరుకు వరదలు రావు ఆందోళన చెందొద్దని చెబుతోందన్నారు. తక్షణమే బుడమేరును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్‌లో విజయవాడ నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని , భవిష్యత్‌లో అటువంటివి జరగకుండా చూడాలన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆటోనగర్(విజయవాడతూర్పు): సూరపనేని వారి సంక్షేమ సంఘం గత 10 ఏళ్ల నుంచి పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు సూరపనేని వెంకటకృష్ణారావు తెలిపారు. వంద అడుగుల రోడ్డులోని ఎగ్జిబిషన్ సొసైటీహాల్లో సూరపనేని వారి సంక్షేమ సంఘం 26వ ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణారావు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇంటర్, ఇంజినీరింగ్, బీసీఏ చదువుతున్న విద్యార్థులకు రూ.31.79 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. ఈ విధంగా ప్రతి ఏడాది సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రస్తుతం 14 మంది విద్యార్థులకు రూ.3.30 లక్షలు అందజేశారన్నారు. కార్యక్రమంలో సూరపనేనివారి సంక్షేమ సంఘం చైర్మన్ ఎస్. శివప్రసాద్, కోశాధికారి నిత్యశ్రీనివాస్, పీఆర్‌ఓ బాపయ్యచౌదరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు అవ్వడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నంకు చెందిన వీరంకి సరిత పోరంకిలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. ఆమెకు శుక్రవారం ఆరోగ్యం బాగాలేకపోవడంతో కానూరులో ఉంటున్న సోదరి ఆరేపల్లి రమాదేవితో కలసి పోరంకికి ఇద్దరు స్కూటీపై బయలుదేరారు. వారు తాడిగడప జంక్షన్ బస్‌స్టాప్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన కారు వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో రక్తం గాయాలు అయ్యాయి. వారిని పోరంకిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖాళీ బిందెలతో నిరసన



ధర్నా నిర్వహిస్తున్న కొండ ప్రాంత వాసులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు డిమండ్ చేశారు. మల్లికార్జునపేట కొండ ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ మల్లికార్జునపేటలోని బాల రమణయ్య, ఆకుల వారి వీధి ప్రాంతాల్లో గత వారం రోజులుగా మంచినీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఈ సమస్యపై ప్రజలు పలుమార్లు అధికారులకు తెలియపరిచిన ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. అందువలనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ప్రజలపై పన్నుల భారాలు పెంచడంలో చూపిన శ్రద్ధ మంచినీరు అందించడంలో చూపించాలని కోరారు. కృష్ణానది పక్కన ఉన్నా ప్రజలకు మంచినీరు అందించడంలో పాలకులు వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. పైప్‌లైన్లు లీకేజీలు నివారించేందుకు తగినంత సిబ్బంది ఏర్పాటు చేసుకోకుండా గాలికి వదిలేస్తున్నారన్నారు. నాణ్యమైన మంచినీరు ప్రజలకు అందించాలని కోరారు. నాయకులు స్థానిక శ్రీనివాస్, కె.జ్యోతి, జి.భవానీ, జి.ఝాన్సీ, టి.వెంకటలక్ష్మీ సీఐటీయూ నేత వి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్‌ల ప్రతిభ



స్వాతంత్య్ర దినోత్సవ పరేడ్‌లో రెండో స్థానం పొందిన ఎన్‌సీసీ కేడెట్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 79వ స్వాతంత్య్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ 17(ఎ) బెటాలియన్ కేడెట్‌లు సత్తా చాటారు. ఆ పరేడ్‌లో చూపిన ప్రతిభతో రెండో స్థానంలో నిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా బహుమతి అందుకున్నట్లు ఆ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే తెలిపారు. పది రోజుల పాటు కఠినమైన డ్రిల్ తోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా సత్తా చాటిన కేడెట్‌లకు, పర్యవేక్షించిన సుబేదార్ భోపాల్ రెడ్డి, నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కె.సుధాకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

విలువలతో కూడిన విద్య అవసరం

విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ కోన శశిధర్



వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థి దశలో కొన్నిటిని త్యాగం చేసి చదువుకే పూర్తి సమయాన్ని కేటాయిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరడం సాధ్యమవుతుందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ సూచించారు. సోషల్ మీడియా, సెల్ ఫోన్లు వంటి వాటికి కొంతమేర దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించిన వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని చెప్పారు. విజయవాడలోని శారద విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ శనివారం ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోన శశిధర్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య మనందరి లక్ష్యం కావాలని తెలిపారు. ఆ మాట కాలేజీ బ్యానర్ పై చూడగానే తనకు ఎంతో ఆనందం కలిగిందని చెప్పారు. నేటి సమాజంలో పిల్లలకు కావాల్సిన సత్ప్రవర్తన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, స్నేహం, గౌరవ మర్యాదలు, సహాయ సహకారాలు, సేవా దృక్పథం, లక్ష్యసాధన, సమాజంలో వారు ఎటువంటి స్థానంలో ఉండాలి అనే అంశాలపై అవగాహన కలిగించాలని సూచించారు. సమాజం, కుటుంబం పట్ల కలిగి ఉండే బాధ్యతలను, మానవతా విలువలను నేర్పించే కేంద్రాలు కేవలం విద్యాసంస్థలే అని వివరించారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని మంచి చెడులను దృష్టిలో పెట్టుకొని వినియోగించుకోవాలని తెలిపారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దుర్వినియోగం చేసుకోకూడదని చెప్పారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్ బాబు అధ్యక్షత వహించగా, గౌరవ అతిథిగా డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు ప్రసంగించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, కళాశాల అడ్వైజర్ ఈ ఎస్ ఆర్ కె ప్రసాద్ తదితరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. యోగా గురువు లంకే జనార్దన్ సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం, ముద్రలపై యోగా సాధకులకు అవగాహన కల్పించి వారితో సాధన చేయించారు. యోగాతో జీవితం సాఫీగా సాగుతున్నట్లు పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

వేతనాల కోసం కార్మికులు ఉద్యమించాలి



ఇబ్రహీంపట్నం: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వేతనాల కోసం ఉద్యమాలు చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రూరల్ వాటర్ సప్‌లైల్లో పనిచేస్తున్న కార్మికులను పంచాయతీ రాజ్ శాఖలో వేతనలు తీసుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వేతనాల కోసం కార్మికులు ఉద్యమ బాట పట్టాల్సి వస్తోందని చెప్పారు. త్వరలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా కాంట్రాక్ట్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

19, 20వ తేదీల్లో వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో లాకుల వద్ద వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గమ్మవారి ఆలయంలో ఈ నెల 19, 20వ తేదీల్లో అమ్మవారి చీరల వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవదాయ అధికారుల సమక్షంలో వేలం ఉంటుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఆటోడ్రైవర్‌కు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులో రోడ్డు దాటుతున్న ఆటో డ్రైవర్‌ను వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ రాజారావు గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భానూనగర్‌కు చెందిన పెదపూడి రాజారావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయన శనివారం ఉదయం టిఫిన్ కోసం బీఆర్టీఎస్ రోడ్డులో రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం రాజారావును ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన రాజారావును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విజయవాడ నగరంలో శనివారం కనులపండువగా నిర్వహించారు. ఆలయాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









